సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



టన్ను చీనీ రూ.16,500

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16,500, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.19

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.19, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3 వేల టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
32.1°/20.5°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

ప్రగతి తప్పిన బతుకులు



ఈ చిత్రంలోని మహిళ పేరు గాయత్రి. ఈమె భర్త సూర్యనారాయణ కదిరి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తూ 2025 ఫిబ్రవరిలో సర్వీస్‌లో ఉంటూ మృత్యువాతపడ్డాడు. గ్రాట్యుటీ కింద రూ.5 లక్షలు, ఆర్జిత సెలవుల నగదు రూ.6 లక్షలు...మొత్తంగా రూ.11 లక్షలు సంస్థ నుంచి అందాల్సి ఉంది. నేటికీ ఆ మొత్తం అందలేదు. కనీసం గాయత్రికి పింఛన్ కూడా మంజూరు చేయలేదు. దీంతో ముగ్గురు ఆడ పిల్లలు, ఒక కుమారుడితో ఆమె పడరానిపాట్లు పడుతోంది.



ఇతని పేరు రాధాకృష్ణ. కదిరి ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేసి గత జూన్‌లో పదవీ విరమణ చెందారు. ఆయనకు గ్రాట్యుటీతో పాటు ఆర్జిత సెలవులకు సంబంధించి రూ.10 లక్షలు రావాల్సి ఉంది. ఆ డబ్బులు వస్తే సొంతిల్లు కట్టుకోవాలనేది రాధాకృష్ణ కోరిక. నాలుగు నెలలుగా సంబంధిత కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నాడు. ప్రభుత్వం నిధులివ్వకపోతే మేమేం చేయాలంటూ అధికారులు విసుక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

...ఇలా ఒకరు, ఇద్దరు కాదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 452 కుటుంబాలు వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కూటమి సర్కార్ దయ చూపకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారు.

- ఆర్థిక ప్రయోజనాల కోసం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల పోరాటం
- ఉమ్మడి జిల్లాలో ఉద్యోగులకు రూ 99.59 కోట్ల బకాయి
- ఆర్థిక ఇబ్బందులతో 452 కుటుంబాలు సతమతం



కదిరి: ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసి కార్మికులు, ఉద్యోగుల జీవితాల్లో వైఎస్సార్ సీపీ సర్కార్ వెలుగులు నింపితే...ప్రస్తుత కూటమి సర్కార్ ఉద్యోగుల కుటుంబాలను అంధకారంలోకి నెడుతోంది. సంస్థ కోసం రేయింబవళ్లు కష్టపడి పని చేసి పదవీ విరమణ పొందిన వారు, ఉద్యోగంలో ఉండగానే మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనాలు అందించకుండా ఏడిపిస్తోంది. పదవీ విరమణ ప్రయోజనాలు అందితే సొంతిళ్లు నిర్మించుకుందామని కొందరు, పిల్లల ఉన్నత చదువుల కోసం, వివాహాల కోసం ఖర్చు చేద్దామని మరికొందరు ఆశ పడ్డారు. కానీ కూటమి ప్రభుత్వం వీరి ఆశలను అడియాసలు చేసింది. ఇక పదవీ విరమణ పొందిన ఉద్యోగులు చాలామంది అనారోగ్యాలతో బాధపడుతున్నారు. వారికి ఆర్థిక ప్రయోజనాలు అందక..సకాలంలో వైద్య సేవలు పొందలేక మృత్యువాత పడుతున్నారు.

వేదన వర్ణనాతీతం..

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 13 ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొత్తం 452 మంది పదవీ విరమణ పొందారు. వీరిలో నలుగురు స్వచ్ఛంద పదవీ విరమణ చేయగా... మరో 103 మంది ఆర్థిక ప్రయోజనాలు అందుకోకుండానే కన్నుమూశారు. కూటమి ప్రభుత్వం వీరికి ఇవ్వాల్సిన ఆర్థిక ప్రయోజనాలు చెల్లించకపోగా, కనీసం ఎప్పుడిస్తారో కూడా చెప్పడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వీరికి గ్రాట్యుటీ కింద రూ. 59.29 కోట్లు, పని చేసిన కాలంలో 300 వరకు అందాల్సిన ఆర్జిత సెలవులు(ఈఎల్)దాదాపు 10 నెలల మొత్తం మరో రూ. 40.3 కోట్లు ఇలా రెండూ కలిపి రూ.99.59 కోట్లు కూటమి ప్రభుత్వం బకాయి పడింది. సెక్యూరిటీ, శ్రామిక్, డ్రైవర్, కండక్టర్ తదితర కేటగిరీల్లోని విశ్రాంత ఉద్యోగులు పేదరికంలో మగ్గుతున్న తీరు, వారు పడుతున్న కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.

జగన్ చరిత్రలో నిలిచిపోయారు..

2019 ఎన్నికలకు మునుపు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో అధికారంలోకి రాగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి 52 వేల మంది కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించారు. ప్రపంచం మొత్తం ప్రైవేటీకరణ వైపు అడుగులు వేస్తున్న ఆ తరుణంలో ఆయన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి చరిత్ర సృష్టించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లు పదవీ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే ఆర్థిక ప్రయోజనాలు అందేవి. కానీ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విశ్రాంత ఉద్యోగులకు ఒక్క రూపాయి కూడా దక్కలేదు. ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే సుమారు రూ.వంద కోట్లు బకాయి పెట్టారు. ఆ డబ్బు కోసం బాధిత కుటుంబీకులు పడుతున్న బాధలు చెప్పనలవి కాదు.

కూలి పనులకు వెళ్తున్నా



నాకు పదవీ విరమణ ప్రయోజనాలు రూ.7 లక్షలు దాకా రావాలి. హయ్యర్ పెన్షన్ కూడా ఇవ్వలేదు. ఇంటి కోసం చేసిన అప్పు కూడా తీర్చలేక పోతున్నా. అందుకే వ్యవసాయ కూలి పనులకు వెళ్తున్నా. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే బకాయిలు పేరుకు పోయాయి. అంతకు ముందు ఇలా లేదు. ఎప్పటికప్పుడు ఇచ్చేవారు.
– సుబ్బరాయుడు, ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్, కదిరి

వంద మందికిపైగా చనిపోయారు



డ్రైవర్, శ్రామిక్, సెక్యూరిటీ తదితర కష్టతరమైన ఉద్యోగాలు ఏళ్లపాటు చేయడంతో ఆరోగ్యాలు దెబ్బతిని చాలా మంది సగటు జీవిత కాలం కంటే ముందే చనిపోతున్నారు. ఏడాది కాలంలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 100 మందికి పైగా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఆర్థిక ప్రయోజనాలు అందకుండానే కన్నుమూశారు. కూటమి ప్రభుత్వం వీరికి సుమారు రూ.100 కోట్లు బకాయి పెట్టింది. ఆ డబ్బులు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.
– ఎం.హరిమోహన్, ప్రధాన సలహాదారుడు, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం, కదిరి

బకాయి వాస్తవమే



ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఆర్జిత సెలవుల బకాయిలు ఉన్నాయి. వీరి వివరాలన్నీ సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశాం. అన్నీ ప్రభుత్వ దృష్టిలో ఉన్నాయి. ఎవరూ ఆందోళన చెందవద్దు. బకాయిలు త్వరలోనే విడుదలవుతాయి.
–మధుసూదన్, జిల్లా ప్రజా రవాణాధికారి

బాలకృష్ణా.. నోరు అదుపులో పెట్టుకో

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ హెచ్చరిక



పెనుకొండ రూరల్: ''బాలకృష్ణా నోరు అదుపులో పెట్టుకో..సినిమాలో డైలాగ్‌లు చెప్పినట్లు నిజజీవితంలో నోటికొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోం జాగ్రత్త'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హెచ్చరించారు. శనివారం ఆమె స్థానిక మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణ మాజీ ఎంపీ చిరంజీవి, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆమె ఖండించారు. బాలకృష్ణ పిచ్చినట్లు అసెంబ్లీలో చిరంజీవిపై అభ్యంతర వ్యాఖ్యలు చేసినా డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్‌కళ్యాణ్ కనీసం స్పందించకపోవడం శోచనీయమన్నారు. అందుకే ఎక్కడో విదేశాల్లో ఉన్న చిరంజీవి స్పందించాల్సి వచ్చిందన్నారు. తన సొంత అన్ననే దూషించినా మౌనంగా ఉన్న పవన్‌కళ్యాణ్ దిగజారుడు రాజకీయం ఇప్పుడిప్పుడే అందరికీ తెలుస్తోందన్నారు. ఇక మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనా బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అతని మానసిక స్థితికి అద్దం పడుతున్నాయన్నారు. ప్రత్యర్థులకు కూడా సాయం చేసే వ్యక్తిత్వం కలిగిన గొప్ప నాయకుడు జగన్ మోహన్ రెడ్డి అన్నారు. టీడీపీ హయాం నుంచీ బసవతారకం కేన్సర్ ఆస్పత్రి బిల్లులు రూ.కోట్లలో పెండింగ్ ఉండగా.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే మంజూరు చేసిన గొప్ప పాలకులు జగన్‌మోహన్‌రెడ్డి అన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అసెంబ్లీలో ఎవరైనా తమ నియోజకవర్గ ప్రజల సమస్యలు ప్రస్తావించి వాటి పరిష్కారానికి చొరవ చూపుతారన్నారు. సొంత నియోజకవర్గానికే చుట్టపుచూపుగా వెళ్లే బాలకృష్ణకు ప్రజల కష్టాలు ఎలా తెలుస్తాయన్నారు. అందుకే ఆయన అసెంబ్లీని ఇతరులను దూషించేందుకే వాడుకుంటున్నారన్నారు. ఏడాది క్రితం హిందూపురం నియోజకవర్గంలో ఒకే కుటుంబానికి చెందిన అత్తాకోడలిపై గ్యాంగ్ రేప్ జరిగితే... బాధితులను పరామర్శించేంత సమయం కూడా బాలకృష్ణకు లేకపోవడం శోచనీయమన్నారు. అలాంటి వ్యక్తి కూడా నేడు జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభ్యంతకర వ్యాఖ్యలు చేయడం చూసి జనమే మండిపడుతున్నారన్నారు. బాలకృష్ణ ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఉషశ్రీచరణ్ హెచ్చరించారు.

న్యూస్‌రీల్

'జీఎస్టీ చాంపియన్స్' రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

- అధికారులకు కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్

ప్రశాంతి నిలయం: జిల్లాలో జీఎస్టీ చాంపియన్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' అమలులో భాగంగా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత వెబ్‌సైట్‌లో అధికారులందరూ వెంటనే లాగిన్ కావాలని ఆదేశించారు. జిల్లా జీఎస్టీ కోఆర్డినేటర్‌గా జాయింట్ కలెక్టర్‌ను రిజిష్టర్ చేస్తామని, ఆయన జిల్లా స్థాయి, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి జీఎస్టీ కోఆర్డినేటర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారన్నారు. మండల స్థాయి జీఎస్టీ కోఆర్డినేటర్లు తమ పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయ స్థాయి జీఎస్టీ కోఆర్డినేటర్లను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. వెబ్‌సైట్ రిజిస్ట్రేషన్ పూర్తయ్యాకే మొబైల్ యాప్ యాక్టివేట్ అవుతుందన్నారు. నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

హాజరు యాప్‌లో నమోదు చేయకపోతే చర్యలు

- సిబ్బందిని హెచ్చరించిన ఐసీడీఎస్ పీడీ ప్రమీల



మొక్కలు నాటుతున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతాన్ని 'పోషణ ట్రాకర్' యాప్‌లో నమోదు చేయాలని, ఇందులో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ పీడీ ప్రమీల హెచ్చరించారు. శనివారం ఆమె తన కార్యాలయంలో సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. రోజూ కేంద్రాలకు వచ్చే పిల్లల హాజరు శాతం, ఎత్తు, బరువు కచ్చితంగా తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎక్కడైనా తప్పులు దొర్లితే సూపర్‌వైజర్ సహకారంతో నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రతి కేంద్రం ఆవరణలో ఆకుకూరలు, కూరగాయలు పెంచాలన్నారు. వాటి ద్వారా వంటలు వండితే ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. స్థలం లేనివారు కనీసం కుండీల్లో పెంచాలని సూచించారు. అనంతరం 'వనం-మనం' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీడీపీఓ జయంతి, సూపర్‌వైజర్లు సుజాత, పుష్ప, రజిత, భారతి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరిపై సస్పెన్షన్ వేటు

కదిరి: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఇద్దరు వైఎస్సార్ సీపీ నేతలపై ఆ పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. నల్లచెరువు జెడ్పీటీసీ సభ్యురాలు బసిరెడ్డి అనిత భర్త విశ్వనాథరెడ్డితో పాటు అదే మండలం ఉబిచెర్ల సర్పంచ్ షమీవుల్లాను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు శనివారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వారిరువురు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో విచారణ జరిపి క్రమశిక్షణ కమిటీ సిఫారసు మేరకు పార్టీ అధినేత ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

గుండెజబ్బులను నిర్లక్ష్యం చేయకూడదు



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జె.రత్నాకర్

ప్రశాంతి నిలయం: గుండె జబ్బులను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రశాంతి నిలయంలో వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రివెంటివ్ కార్డియాలజీపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌ను సాయి హీరా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ సమీపంలోని సత్సంగ్ భవన్‌లో రత్నాకర్ రాజు ప్రారంభించారు. ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రులు, మెట్రోపాలిటన్ సిటీల్లో మాత్రమే నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌ను ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. రోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎగ్జిబిషన్‌ను ఉంటుందని, హృదయ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతో పాటు హృద్రోగాలను నిర్ధారించే పరీక్షలను సైతం నిర్వహిస్తారన్నారు. ఎగ్జిబిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు



ఇన్‌చార్జ్ డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగుల కార్యాచరణ కమిటీ సభ్యులు

- స్పష్టం చేసిన సచివాలయాల ఉద్యోగులు

ప్రశాంతి నిలయం: తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని సచివాలయ ఉద్యోగులు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్త ఉద్యమ కార్యాచరణలో భాగంగా అక్టోబర్ ఒకటవ తేదీ నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మె తప్పదన్నారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డిని కలిసి ఐక్య కార్యాచరణ కమిటీ తరఫున వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సచివాలయ ఉద్యోగులు మాట్లాడారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలకు సంబంధించి ప్రభుత్వం ముందు 8 న్యాయమైన డిమాండ్లను ఉంచామని, వీటికి ప్రభుత్వం ఒప్పుకోకపోతే తమ పంథా మారబోదన్నారు. కార్యక్రమంలో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు కార్యాచరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దసరా జాతర



బస్సులో సీటు కోసం పరుగెత్తుతున్న ప్రయాణికులు

కదిరి అర్బన్: దసరా సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణాల్లో చదువుకుంటున్న విద్యార్థులంతా స్వగ్రామలకు, బంధువులు, స్నేహితుల ఊళ్లకు పయనమయ్యారు. మరోవైపు పండుగ కోసం ఆడబిడ్డలంతా తమ పుట్టింటికి చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రెండు, మూడు రోజులుగా ఆర్టీసీ బస్టాండులన్నీ కిటకిటలాడుతున్నాయి. శనివారం అయితే కదిరి ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో పోటెత్తింది. సర్వీసులు తక్కువగా ఉండటంతో బయటి నుంచి కానీ, డిపోలోంచి కానీ బస్సు అలా వస్తే చాలు... సీటు కోసం జనం పరుగులు తీస్తూ పోటీపడ్డారు. 60 మంది సామర్థ్యం కలిగిన బస్సుకు రెట్టింపు సంఖ్యలో ఎక్కారు. హిందూపురం, అనంతపురం, రాయచోటి, మదనపల్లి రూటు బస్సులకు రద్దీ విపరీతంగా కనిపించింది. బస్టాండు ప్రాంగణం ప్రయాణికులతో నిండి జాతరను తలపించింది.

ఉచిత ప్రయాణం తెచ్చిన తంటా

- వృద్ధురాలితో తోటి మహిళా ప్రయాణికుల గొడవ
- బస్సు ముందు బైఠాయించిన వృద్ధురాలు



బస్సు ముందు బైఠాయించిన వృద్ధురాలు

కదిరి: కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరుతో తెచ్చిన ఉచిత బస్సు ప్రయాణం మహిళల మధ్య గొడవలకు తావిస్తోంది. ప్రతి రోజూ ఏదో ఒక చోట ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా కదిరిలో కూడా మహిళా ప్రయాణికుల మధ్య ఇలాంటి గొడవే జరిగింది. వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం కదిరి నుంచి హిందూపురానికి వెళ్లేందుకు పల్లె వెలుగు బస్సు కదిరి బస్టాండ్‌కు వచ్చి ఆగింది. హిందూపురం నుంచి కదిరి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన ఇద్దరు మహిళలు రద్దీని గమనించి బస్సు కిటికీ ద్వారా తమ బ్యాగు ఒక సీటులో వేసి సీటు రిజర్వ్ చేసుకున్నట్లు భావించారు. అయితే కదిరికి చెందిన ఓ వృద్ధురాలు ఆ మహిళల కంటే ముందే వెళ్లి ఆ సీటులో ఉన్న బ్యాగు పక్కకు జరిపి కూర్చుంది. దీంతో ఆ ఇరువురు మహిళలు వృద్ధురాలితో గొడవకు దిగారు. ఈ లోగా బస్సు బయలుదేరి వేమారెడ్డి కూడలిని చేరింది. గొడవ పెద్దది కావడంతో డ్రైవర్ బస్సు ఆపేశాడు. వృద్ధురాలు బస్సు దిగి రోడ్డుపై ఆ బస్సు ముందు బైఠాయించింది. తనపై దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది. విషయం పోలీసుల వరకూ వెళ్లింది. దీంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న పట్టణ ఎస్ఐ బాబ్జాన్ వృద్ధురాలితో పాటు ఆ ఇరువురు మహిళలను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. తప్పు తెలుసుకున్న ఇరువురు మహిళలు వృద్ధురాలికి క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు ప్రారంభం


కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో 5వ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్–2025 పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. అతిథులు మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, అపజయం వెనుక విజయం ఉంటుందన్న సత్యాన్ని క్రీడాకారులు గ్రహించి విజయం వైపు పయనించాలన్నారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. రెండు రోజుల పాటు పోటీలు జరగనున్నాయని, బాల, బాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయని రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో రెజ్లింగ్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


మాట్లాడుతున్న డైరెక్టర్ షన్ముఖకుమార్

అనంతపురం టౌన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న వాటర్‌షెడ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐడబ్ల్యూఎంపీ డైరెక్టర్ షన్ముఖకుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా డ్వామా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 10 ప్రాజెక్టుల పరిధిలో 848 పనులు చేపడుతున్నట్లు తెలిపారు. చెక్‌డ్యాం నిర్మాణ పనులతోపాటు నీటి కుంట పనులను వచ్చే నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. 10 రోజులకోకసారి వాటర్‌షెడ్ పనులపై సమీక్ష నిర్వహించాలని డ్వామా పీడీలను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాష, ఏపీడీ కృష్ణ చైతన్యతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

బస్సులో మహిళ నగల చోరీ

కదిరి టౌన్: బస్సులో ఓ మహిళ బంగారు నగలు చోరీకి గురైన ఘటన కదిరిలో వెలుగుచూసింది. వివరాలు.. అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన హేమలత కుమార్తె బళ్లారిలో నివాసముంటోంది. ఆమెకు అనారోగ్యంగా ఉండడంతో చూసేందుకు శనివారం తల్లి హేమలత పీలేరు నుంచి బళ్లారికి బస్సులో బయలు దేరింది. తనకల్లు వద్ద బస్సు చెడిపోవడంతో మరో బస్సు ఎక్కింది. కదిరికి వచ్చిన తరువాత బ్యాగు చూసుకోగా అందులోని 6 తులాల బంగారు నగలు, ఏటీఎం కార్డు, బ్యాంకు లాకర్ తాళాలు, పాన్ కార్డు కనిపించలేదు. దీంతో హేమలత పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొక్కజొన్న రైతు కుదేలు

ఖరీఫ్‌లో డివిజన్ల వారీగా మొక్కజొన్న సాగు వివరాలు	
డివిజన్	సాగు(హెక్టార్లలో)
ధర్మవరం	1,539
హిందూపురం	9,983
కదిరి	2,273
మడకశిర	1,807
పెనుకొండ	3,550
మొత్తం సాగు	19,152 హెక్టార్లు

- వైరస్ కారణంగా భారీగా తగ్గిన దిగుబడి
- మార్కెట్‌లో పడిపోయిన ధరలు
- పెట్టుబడి కూడా లేక ఆవేదన
- పట్టించుకోని ప్రభుత్వం


కోతలకు సిద్ధంగా ఉన్న మొక్క జొన్న పంట


కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్నలు

పెనుకొండ రూరల్: మొక్కజొన్న రైతులు కుదేలయ్యారు. పంట పెట్టుబడి కూడా గిట్టుబాటు కాకపోవడంతో డీలా పడిపోయారు. మూడు నెలల పాటు కష్టపడి పండిస్తే చివరికి నష్టాలే మిగలడంతో మొక్కజొన్న రైతుల వేదన వర్ణనాతీతంగా మారింది.

లోలోనే కుమిలిపోతూ..

జిల్లా వ్యాప్తంగా మూడు నెలల క్రితం రైతులు విస్తారంగా మొక్క జొన్న సాగు చేశారు. గత ఏడాది జిల్లావ్యాప్తంగా 22,731 హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగవగా, ఈ ఏడాది 19,152 హెక్టార్లలో సాగులోకి వచ్చింది. మొదట్లో కళకళలాడిన పంటకు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వైరస్‌లు సోకాయి. దీంతో దిగుబడి భారీగా పడిపోయింది. దీనికితోడు మార్కెట్‌లో ధరలు కూడా పతనమయ్యాయి. నెల క్రితం క్వింటాలు రూ. 3,000 పలికిన మొక్క జొన్న ఇటీవల రూ. 1,900కు పడిపోయింది. ఈ క్రమంలో కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా చేతికి అందేలా కనిపించకపోవడంతో రైతులు డీలా పడిపోయారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంపై అలసత్వం ప్రదర్శిస్తుండడంతో తమ బాధ ఎవరికి చెప్పుకోలేక తెలియక కుమిలిపోతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



3 ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశా. దాదాపుగా రూ. లక్షకు పైగా ఖర్చయింది. పంటకు వింట్ వైరస్ సోకడంతో దిగుబడి భారీగా తగ్గిపోయింది. 110 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి కేవలం 50 క్వింటాళ్లకు పరిమితమైంది. మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో పెట్టుబడి కూడా వచ్చేలా కనిపించడం లేదు. ప్రభుత్వం స్పందించి మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి. – ప్రకాశ్ రెడ్డి, గొల్లపల్లి

అప్పుల్లో కూరుకుపోతున్నాం



4 ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశా. రూ. 1.50 లక్షల వరకూ ఖర్చయింది. ఇటీవల కురిసిన వర్షాలతో పంటకు వైరస్ సోకడంతో 140 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి 90 క్వింటాళ్లకు పడిపోయింది. దానికి తోడు మార్కెట్‌లో సరైన ధరల్లేవు. మొక్కజొన్న రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాం. – రామాంజినేయులు, చంద్రగిరి

రైతులను ఆదుకోవాలి



మొక్కజొన్నకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలి. వర్షాల కారణంగా వైరస్ సోకడంతో దిగుబడి బాగా పడిపోయింది. క్రాప్ బుకింగ్ ప్రామాణికంగా తీసుకొని రైతులకు పరిహారం అందజేయాలి.
– కొండల రాయుడు, మండల వ్యవసాయ సలహా కమిటీ మాజీ చైర్మన్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

గతంతో పోలిస్తే మొక్కజొన్నకు మార్కెట్‌లో ధర తగ్గింది. గిట్టుబాటు ధరల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం.
– రాము నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

- ఎస్పీ సతీష్‌కుమార్


నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి టౌన్: పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. శనివారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో అలసత్వం చూపరాదన్నారు. కేసుల ఛేదనలో టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. మహిళలపై జరిగే నేరాలను తీవ్రంగా పరిగణించాలన్నారు. వీలైనంత త్వరగా విచారణ జరిపి చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. జూదం, గంజాయి, మట్కా, అక్రమ మద్యం తదితర అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలన్నారు. నిందితులకు త్వరగా శిక్షలు పడేలా కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. రాత్రివేళ గస్తీలు ముమ్మరం చేసి చోరీలకు కళ్లెం వేయాలన్నారు. అనుమానితులను గుర్తించి వేలిముద్రలు సేకరించాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమష్టిగా పనిచేసి నేరాలను నియంత్రించాలన్నారు. సమావేశంలో డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, ఐటీ కోర్ ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ముదిగుబ్బ: మండల కేంద్రమైన ముదిగుబ్బలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జొన్నలకొత్తపల్లి గ్రామానికి చెందిన అరవింద్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. అరవింద్ తన ద్విచక్ర వాహనంలో ముదిగుబ్బ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి ఐచర్ వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అరవింద్ రెండు కాళ్లు విరిగిపోయాయి. చికిత్స నిమిత్తం వెంటనే ఆసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఈ– పంట వంద శాతం పూర్తి చేయాలి

- సీపీఓ విజయ్‌కుమార్, డీఏఓ రాముానాయక్


మాట్లాడుతున్న సీపీఓ విజయ్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ఈ– పంట నమోదు వంద శాతం పూర్తి చేయాలని సీపీఓ విజయ్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి రాముానాయక్ అన్నారు. శనివారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంట కోత ప్రయోగాలు, ఈ–పంట నమోదుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ఈ–పంట' ప్రక్రియ పూర్తి కాగానే పంట కోత ప్రయోగాలు చేపట్టాలన్నారు. యాప్‌లో ప్రతి సర్వే నంబర్‌లోని భూమినీ నమోదు చేయాలన్నారు. వీటి ఆధారంగానే పరిహారం, ఎరువులు, కొనుగోలును ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఆలస్యంగా వేసిన పంటలను నమోదు చేయడంతో పాటు ముందస్తు వర్షాలు, బోరు బావుల కింద సాగు చేసి తొలగిస్తున్న పంటల్లో కోత ప్రయోగాలు నిర్వహించాలన్నారు. పొడవు, వెడల్పు, దిగుబడి తదితర వాటిని కచ్చితంగా నమోదు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారుల సహకారంతో ప్రయోగాలను నిర్వహించాలన్నారు. రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. కొన్ని పంటల్లో 5''5 మీటర్లు, 10''10 మీటర్లు , ఉల్లికి మాత్రమే 2''2 మీటర్ల కొలతలలో పంట కోత ప్రయోగాలు చేపట్టాలన్నారు. పంట నష్టం సంభవిస్తే రైతులను ఆదుకునేందుకు ప్రయోగాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సర్వే అధికారి హరినగేష్, ఏడీఏ (ప్లానింగ్) బాలాజీ నాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సులపై నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో పాటు వందశాతం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 28 సంవత్సరాలు ఉండి పదో తరగతి పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఫెయిల్/పాస్ వారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత శిక్షణ, వసతి, భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు. కంప్యూటర్, ట్యాలీ కోర్సులతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్ లాంటి అంశాలపై అత్యుత్తమ స్థాయిలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9000487423లో సంప్రదించాలని సూచించారు.

నల్లరేగళ్లలో ఏడాది పొడవునా పప్పుశనగ సాగు

- ప్రకృతి సాగు పద్ధతుల్లో అవకాశం
- సీటీఐఓ లక్ష్మానాయక్


మాట్లాడుతున్న సీటీఐఓ లక్ష్మానాయక్

అనంతపురం అగ్రికల్చర్: ప్రకృతి సిద్ధ సాగు పద్ధతుల్లో (న్యాచురల్ ఫార్మింగ్) ఏడాది పొడవునా నల్లరేగడి భూముల్లో పప్పుశనగ పండించడానికి అవకాశం ఉందని చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ (సీటీఐఓ) లక్ష్మానాయక్ తెలిపారు. స్థానిక ప్రకృతి వ్యవసాయం (డీపీఎంయూ) కార్యాలయంలో అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, ప్రకాశం, నంద్యాల, కర్నూల, బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన 40 మంది న్యాచురల్ ఫార్మింగ్ సిబ్బందికి మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా సీటీఐఓ మాట్లాడుతూ పప్పుశనగతో పాటు ఏ–గ్రేడు కింద ఆవాలు, నువ్వులు, కంది, ఆముదం, అనుములు, వంగ లాంటి పంటలను వేసుకోవచ్చన్నారు. దీంతో అదనపు ఆదాయంతో పాటు పంటలకు వ్యాపించే చీడపీడలు బాగా తగ్గుతాయని తెలిపారు. ఎలాంటి రసాయనాలు, పురుగు మందులు వాడకుండా కేవలం గో ఆధారిత ఘన, ద్రవ జీవామృతాల ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. తాడిపత్రి మండలం రావివెంకటాంపల్లి గ్రామంలో ప్రయోగాత్మకంగా ఏ–గ్రేడు పద్ధతిలో పప్పుశనగ సాగు చేయించామని తెలిపారు. భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని, రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడం, మంచి దిగుబడులతో పాటు ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ మెరుగు పడుతుందని తెలిపారు.

పనుల్లో పురోగతి లేకపోతే ఉపేక్షించేది లేదు

- పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ బాలూ నాయక్


మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలూ నాయక్

అనంతపురం సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రహదారులు, బ్రిడ్జిలు, భవనాల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, లేకపోతే ఉపేక్షించేది లేదని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) బాలూ నాయక్ హెచ్చరించారు. స్థానిక ఆ శాఖ రాయలసీమ సర్కిల్ కార్యాలయంలో అనంతపురం, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. పీఎంజీఎస్‌వై కింద చేపట్టిన తారు రోడ్లు, బ్రిడ్జిలు, నాబార్డు కింద చేపట్టిన రోడ్లు, ఉపాధి హామీ పథకం కింద చేపట్టి అర్ధాంతరంగా ఆగిన హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలపై ఈఎన్‌సీ ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద కొత్తగా పంచాయతీ భవనాలు మంజూరయ్యాయని, ఒక్కో పంచాయతీ భవనానికి రూ.32 లక్షల చొప్పున కేటాయించినట్లు వివరించారు. ఈ పనులు సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నాణ్యత వంద శాతం పాటించాల్సిందేనని, లేకపోతే కాంట్రాక్టర్లతో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్దేశిత లక్ష్యాల కేటాయింపులో వెనుకబడిన ఇంజినీర్లు పని తీరు మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌ఈ బండారు మురళీ, కర్నూలు ఎస్‌ఈ వేణుగోపాల్, ఈఈలు ప్రభాకర్‌రెడ్డి, శ్రీరాములు, శంకరయ్య, క్యూసీ ఈఈ మల్లికార్జున మూర్తి, ఆదోని ఈఈ రామకృష్ణ, డీఈఈలు కె.లక్ష్మీనారాయణ, జింకల కృష్ణజ్యోతి, గుత్తి మురళీధర్, ఎస్‌ఈ పీఏ రాజేంద్రప్రసాద్ సహా నాలుగు జిల్లాలకు చెందిన పీఆర్, పీఆర్ఐ, పీఐయూ, క్వాలిటీ కంట్రోల్ డీఈఈలు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పరిశీలన..

పెద్దవడుగూరు మండలం చిత్తూరు–పామిడి మార్గంలోని వంకపై పీఎంజీఎస్‌వై–3 కింద రూ.16.75 కోట్లతో నిర్మించతలపెట్టిన బ్రిడ్జి నిర్మాణాన్ని ఈఎన్‌సీ శనివారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బ్రిడ్జి నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడొద్దని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్ వాసి మృతి

కనగానపల్లి: రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్ వాసి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని భానుకోట సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రతన్ (30) భార్య హుయాదేవి, ఇద్దరు కుమారులతో కలిసి కళ్యాణదుర్గంలో ప్లేవుడ్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో ధర్మవరం వెళ్లి రాత్రి తిరుగుపయనమయ్యాడు. భానుకోట వద్ద రహదారిపై స్పీడ్ బ్రేకర్ గమనించక కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 వాహనంలో ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స ఫలించక శనివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల కేసు నమోదు

కదిరి టౌన్: తనను అత్త, ఆడపడుచు వేధిస్తున్నారంటూ మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లికి చెందిన వివాహిత శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. గాండ్లపెంట మండలం గాజువారిపల్లికి చెందిన శ్రీలతకు, మూర్తిపల్లికి చెందిన మహేష్‌తో మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మహేష్ యాక్సిడెంట్‌లో మృతి చెందాడు. ఇది జరిగిన కొన్నిరోజులు శ్రీలతను అత్తమామలు మంచిగా చూసుకున్నారు. తరువాత ఆడపడుచుతో కలిసి వేధించడం ప్రారంభించారు. దీంతో శనివారం శ్రీలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు సీఐ వి.నారాయణ రెడ్డి తెలిపారు.

మోదీ, చంద్రబాబు కార్మిక వ్యతిరేకులు

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ధ్వజం


ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

అనంతపురం అర్బన్: ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కార్మిక వ్యతిరేకులని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ధ్వజమెత్తారు. సీఐటీయూ జిల్లా మహాసభలు శనివారం నగరంలో ప్రారంభమయ్యాయి. ముందుగా ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి నగర పాలక సంస్థ వరకు ర్యాలీ నిర్వహించారు. సీతారాం ఏచూరి ప్రాంగణం (స్థానిక ఫంక్షన్ హాలు)లో సీఐటీయూ జెండాను సీనియర్ నాయకుడు ఏజీ రాజమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. సీఐటీయూ ఆఫీసు బేరర్లు నాగమణి, నాగరాజు, శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ప్రతినిధుల సభకు నరసింగరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం చంద్రబాబు దేశంలోనే అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. పీ–4తో పేదరికం లేకుండా చేస్తానంటూ మరింత పేదరికంలోకి నెట్టేసే విధానాలు అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయన్నారు. పెట్టుబడిదారీ విధానాలు అమలు చేస్తూ శ్రమదోపిడీకి సిద్ధమయ్యాయని మండిపడ్డారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని దుమ్మెత్తిపోశారు. రాష్ట్రంలో 10 గంటల పని విధానంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కూటమి ప్రభుత్వం కార్మిక ద్రోహిగా మారిందని మండిపడ్డారు. బ్రిటిష్ పాలకులు కూడా నిత్యావసర సరుకులపై సుంకాలు వేయలేదని, కానీ మోదీ ప్రభుత్వం నిత్యావసరాలపైనా పన్నులు విధించిందని విమర్శించారు.8 గంటల పని విధానం, కార్మికులకు కనీస వేతనాలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణతో పాటు ఉచిత విద్య, వైద్యం అమలు, హక్కుల పరిరక్షణకు ఉద్యమాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప, నాయకులు బాలరంగయ్య, లింగమయ్య, ఆర్‌వీనాయుడు, గోపాల్, ముత్తూజా, వెంకటనారాయణ, రామాంజినేయులు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపర్తిలో అదృశ్యం.. బళ్లారిలో ప్రత్యక్షం


భార్యబిడ్డలతో పోతులయ్య

రాప్తాడు: గాండ్లపర్తిలో అదృశ్యమైన తల్లీపిల్లలు బళ్లారిలో ప్రత్యక్షమయ్యారు. వివరాలు.. మండలంలోని గాండ్లపర్తి గ్రామానికి చెందిన సాకే పోతులయ్య భార్య పద్మలత తన మూడేళ్ల కుమార్తె భానుశ్రీ, 8 నెలల కుమార్తె బేబీతో కలిసి ఈ నెల 23న అదృశ్యమైంది. దీనిపై పోతులయ్య ఫిర్యాదు మేరకు సీఐ టీవీ శ్రీహర్ష కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో గాలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఆలయాల దగ్గర గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలోనే బళ్లారిలో తల్లీకుమార్తెల ఆచూకీ లభ్యం కావడంతో వెళ్లి తీసుకొచ్చారు. శనివారం వారిని తహసీల్దార్ ఎదుట ప్రవేశపెట్టిన అనంతరం భర్త సాకే పోతులయ్యకు అప్పగించారు. పోలీసులను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు అభినందించారు.


మహిళ ఆత్మహత్య

బెళుగుప్ప: కడుపు నొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని నక్కలపల్లిలో శనివారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన రామ్మోహన్, వెన్నపూసల సుజాత (49) దంపతులు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. సుజాత ఇటీవల కడుపు నొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించినా తగ్గలేదు. కడుపునొప్పి అధికం కావడంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో చీనీ చెట్లకు కొట్టే పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురం ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా.. చికిత్స ఫలించక మృతి చెందింది. దీనిపై బెళుగుప్ప పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రశాంతి నిలయంలో విద్వాన్ మహాసభ


ప్రసంగిస్తున్న కమలాకర్ శర్మ

ప్రశాంతి నిలయం: దసరా వేడుకల్లో భాగంగా ప్రశాంతి నిలయంలో రెండో రోజు శనివారం ప్రశాంతి విద్వాన్ మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కమలాకర్ శర్మ మాట్లాడుతూ ఆధ్యాత్మికతకు, సైన్స్‌కు మధ్య ఉన్న సంబంధాన్ని చక్కగా వివరించారు. అనంతరం భక్తులు సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి